# పిర్ర్వ బండ

ఇన్నాళ్లకు మీరు నన్ను రమ్మంట పిలువనంపితె, మొగులంత మబ్బులిడ్సి కళ కళ లాడంగ ఎన్నెల్లు కురిసినట్ల అనిపిచ్చింది. మీ ప్రాణవార్తికం సల్లగుండ. మీ పిలుపు యినంగనె ఎదల నిండ తీపులు నిండంగ ఎదమెత్తన తోటి మీ కడపలల్ల కాలు మోపుతుండ, మరి, మీరంత బాగుండర ?

ఎద మెత్తన జేసెటి కల్పుగోలుతనం వుండాలెగని దూరం ఏపాటి ? అదేం మో యలేని బరువా ? దాటరాని దర్మగుండమ ? ఒగరం గాకున్న ఒగరం అయురి కలిడ్సి తన మనోండ్లంట వలుకరిస్తె మూరు వలుకని మొారుదోపు తనం, నెత్తిబిరుసు ఎవరి కుంటది ? అందికె అప్పుడొ ? ఇప్పుడొ కల్సుకునుడు మంచిది.

మీ ప్రాణవార్తికం సల్లగుండ, రా ! రమ్మంట ఎంటవడిపిల్సినోళ్ల వూకె రమ్మన్నారు ? కమ్మటికత పూసగుచ్చినట్ల జెప్పమన్నరు. అయితె ? కతలకు మీ వూరు పుట్టినిల్లు . కదిలిస్తెసాలు కచ్చపాదకాయలురాల్సినట్ల మీ కడ్వ కతలు గుమ్మరిస్తది. అసొంటి మీరు కత జెప్పుమంట నన్నడిగి నిజంగనె కతలు వడ్తుండరు. మీ కతలు ఈనా టివ ? ఆనాటివా ? తరాలనాటి తాతలకు ఎన్నలు వెట్టి ఎత్తి దించిన తాతమ్మ పోయిన పోకళ్ల సొంటివి.

తొలినాటి తెలుగు రాజుల కాలం నాడే మీకూ మాకు సుట్టిర్కముండిందంట. ఇక్ష్వాకుల కాలంనాడు ములక రాష్ట్రం, మెత్కుసీమ అంటె మెదకు తోటి గలిసే కడప వుండింది. పూగి నాడు, హిరణ్య రాష్ట్రం గూడంగ, నెల్లూరు,గుంటూరు, తెలంగాణం ఆరు రాష్ట్రాలు కలిసే వుండేవి అంట. అందికే కొత్తకుండ కంటుకున్న వాసనోలె మీకూ మాకు సవందం ఎన్కటి నుండే వుండింది.

మీ కేంది ? కడ్పున సల్ల గదులకుండ వుండరు. మీరంత బంగారు బచ్చున బొమ్మలు, వజ్రాల గాదెలు, లగు,బిగు బండాలం తోటి గట్టి పునాదులున్న మీరు మర్పున వడ్డట్ల నన్ను కతలడ్గుతుండరు.

అయితె యినుండి నా నోటి ముత్యాలొలుకంగ కత జెప్పుత, మీ పుట్కలు నింపుకుందురుగాని,

మొన్న సూతమంట సుట్టాల మార్గంగ మా మ్యానమామ ఎంట మా అమ్మమ్మ వూరు బండ పర్పుకు వోయిన. ఇదేం పేరంట యినేది యినంగనె ముక్కు మీద ఏలేసు కోకుండి. పేరన్నంక యాదన్న విచిత్రం లేకపోతె ఆ పేర్ల పెద్దీర్కం యాడుంటది ? కత లెట్ల వుడ్తయి?.

ఆ వూరంత రాతిమయం, సుట్టురాకొండలు, గుట్టలు, ఎండకాలం ఈ గుట్ట రాళ్లన్ని బుగ బుగమనుకుంట పొగలు గక్కుతుంటె వూళ్లమంది అంత కుమ్మెల కోడుగుడ్లు వుడ్కినట్లు వుడ్కుతరుగని, వానకాలంల మట్టుకు కొండలన్ని వచ్చసీర గట్టి కనుకాంబురాలు సింగారిచ్చినట్ల సోకులు వోతవి.

అసొంటి అపురూపం వూరికి వో వాల్నంటె ? బస్సెక్కి, బండెక్కి, కాలి బాట నడ్సి కన్నమ్మ కష్టం బడుకుంట బోవాలె.

సూస్కు మూర్వ, సెప్పుకేడ్వ అన్నట్ల ఆ వూరి మందికి ముప్పూటల వరి మెత్కులె కరువు. పుట్టినంక పూరి మేసి అన్న పొట్టగడ్పుకోవాలె అన్నరు, అందికె వాళ్ల కష్టమో ? నిష్ఠురమో ? అంట లేనినాడు దుంపగడ్డలు, తాటిపండ్లు, ఈతపండ్లు కాల్చిన చింతవల పండ్లు దిని కాలం ఎళ్లదీస్తరు గని వూరు యిడ్సిపోరు.

ఈడ యింగో గమ్మతేందంటె ? ఈవూరు కనుసూపుమేర అంత అడివే ! అయిన గని పని ముట్ల కోసం కల్పవాడుకోరు. ఆడ, వల్సినన్ని మద్ది, సంద్ర, యిప్ప; లొద్దుగ, న్యారాప సెట్లున్న గని స్తంబాలకు, వాట్లకు, యింటి కప్పులకు, గోడ కొయ్యలకు, యింటి తలుపులకు, కుండలకు గుడ కల్ప వాడుకోరు, బండి షయ్యోలకు, గుడరాతి సల్పలె వాడ్తరు. అందికె ఆ వూరు 'పర్పుబండ' అయిందని నా కనిపిస్తుండది.

ఇసొంటి అవూరికి నా పయినం సునాయాసంగ సాగింది. ఎందుకంటె రొండు గట్ల నడ్మ అల్గుదుంకే కాడ సెర్వువు కట్టేసి వొంతెన గట్టిన్రు. అవొంతెన మీది కెళ్లి అరా బురిగ నడ్సుకుంట యిల్లు జేరిన.

ఇంగ నేను వొంగనె జనమంత కందిరీగెలు లేసినట్ల మేల్కొని రయిం రయిం

మంట తిర్గవట్టిన్రు. వూరంత లొల్లే, సంబురమె ! జనం బంతిదిర్గినట్ల కండ్ల వడ్తుండరు.

ఊళ్లెకు బాకాలూ, పీకెలూ, సన్నాయిలొచ్చినయ్. బైస్కిళ్లొచ్చినయ్. వూరెన్క తడ్క దళ్లవడ్డవి. ఆ తడ్క లెన్క సాటున నల్లగల్లు, తెల్లకల్లు కుండలు ఐరేణీ దేవత లోలె, సప్తమాతృకలోలె, అక్కలమ్మలోలె బార్లు దీరికూర్సున్నయి. ఇంగ యీ దుకాణాలల్లనె రేడియో పాటలు ఏడు సారాలను దాటి యినిపిస్తుండది.

రేపు మనూరికి పెద్ద పెద్దోళ్లు అంటె ఎమ్మెల్లేలు, మినిష్టర్లు, కారు దిగనోళ్లు, కాలికి మన్నంటనోళ్లు, మెరుగు బంగారం దినెటోళ్లు అరిచేతుల సొర్గం జూపెటోళ్లువొస్తరంట. మళ్ల మనకు మన తలి దండ్రాదులు వుత్తపేరుకే నంట, ఇంగ మనకు తల్లీ తండ్రి, అన్నం బట్ట సిబ్బి శాట అంత వొచ్చెటి ఆ పెద్ద పీటలేనంట మురిసి ముద్ద బంతులైతుండరు, సెండు వూలైతుండరు.

ఇంతట్లకె తొప్పెట్లు దడ దడ మంట నాదియ్యవట్టినవి. ఆవూరి సిన్నా పెద్ద అంత సబ్బండ జనం - ఆఁ సబ్బండ జనం అంటె ? ఏంది ? అంటుండారు ? అయ్యొ తల్లి ! సబ్బండ అంటె సమస్తం, సకులం, సబ్రహ్మాండం '' ఈ సమస్త జనం అందరు వోట్లమ్మ గుడికి రావాలె '' అంట సాటిచ్చిన్రు. ఆ సాటింపు నాసెవుల వడంగనె నా కేందోసక తిక్క మొకం ఏసిన, యింగ నామనుసుల నాకు ఎందరో ద్యావర్లు దెలుసు ! అంటె ? ఎల్లమ్మ, దుర్గమ్మ, సారమ్మ, సవరమ్మ, బండ్లమ్మ, బాలమ్మ, పోశమ్మ, సీతలమ్మలుగని ఈ వోట్ల తల్లి పేరు మట్టుకు యిన లేదు, యీ తల్లి ఎవరో ? అంట రొండెర్గనట్ల తెల్ల మొక మేసిన. నన్ను జూసి మా మామ.

'ఏం దే ! ఎచ్చా ! ఏం దెల్వని ఎడ్డీర్కవోలె నిలవడ్తివి. ఇందుట్ల కొత్త ఏముండది ? అక్కర కొద్ది దేవుండ్లు, ఏనాటికన్నా బాట పోంటి నడిసిందె పయినం, వోట్ల పోంటి దక్కుతున్నవె తఖ్తులు, ఈ మాట గురి దెల్సిన మన పంచు లందరు యాకమై, పదురుకున్నట్లు, కూడ వలుక్కోని నిలవెట్టిన దేవుత ఈ వోట్లమ్మ, ఇట్ల వుట్టిచ్చిన దేవుతకు ప్రాణప్రతిష్ఠ అయ్యగారి చేత జేపిచ్చి నమ్మకాన్ని గట్టివారిత్తం ' అంట జరిపే తతంగం యిది అంట జెప్పుతుండంగనె అవుతలి పార్టోళ్లల్ల వోయువక నాయకుడు లేసి '' అదేంది సారూ ! వోట్లమ్మ ''అంట ఎందుకు ?'వోట్లన్న ' అనరాదుండి '' అన్నడు.

ఈ మాటలిన్న రంగనాయకుడు ముసి ముసి నగినట్ల బొమ్మలు ముడ్సి లేసి ఇవేం మాటలు తమ్ముడు ! ఇత్తులేంది సెట్టెట్లొస్తది ? చెట్టులేని కొమ్మ లెట్ల వుడ్తయి. అది గాకుండ దేవుండ్ల కాడ గుడ ఆడీ, మొగ అంట తకరారు ఎందుకయ్య ? అంత ఆ తల్లే ! అక్కరకు ఆమెనె ఆడి అయితది, మొగ అయితది. తల్లైతది, తండ్రైతది, అన్నైతది, అన్నడు. ఈ మాటలినంగనె అందరు రంగనాయకులకు 'జై' అన్నరు. ఇంగ పెద్దలు వో ముక్కోణపురాయిని మలిపిచ్చి ముద్దుగ ఎర్ర సీర గట్టి ముక్కు పోగు వెట్టి పసుపుకుంకుమల అలంకార జేసి అయ్యగారు పుణ్యావాచనం జేయంగ కొబ్బరి కాయగొట్టి వోట్లమ్మను నిలవెట్టిన్రు. ఇట్ల వోట్లమ్మ ఎలిసింది అంట మామ కతోలె జెప్పిండు.

ఇదంత యిన్నంక ఎన్కటికి రేవతమ్మకు మొగడు ఎవ్వరో అంట బ్రహ్మయ్యను అడ్గనికె సోయి సత్తెలోకం నుండి తిర్గి తండ్రి బిడ్డలు భూలోకం వొచ్చెటాల్లకు ద్వారకా పట్టణమంత మారిపోయినట్ల నాకనిపిచ్చి సిత్రంగ జూడవట్టిన , ఎట్లనన్న ఆ తమాస నేను కండ్లార జూతం అంట మామ ఎంట వోట్లమ్మ గుడికాడ్కి వోయిన.

ఆడ్కివోంగనె జనజాతర. ఆడబండలన్ని ఎత్తులు వారిగ ఏరి పెద పెద్దోళ్ల వంతుల వారిగ గూసునె టందుకు గద్దెలోలె ఏసిన్రు. వాటి ఎదురుగనె వో సల్ప రౌతును టేబిలోలె జేసిండ్రు. జనమంత వుస్కవోస్తె వుస్కరాలకుండ అర్కలు పర్సినట్ల గూసున్నరు.

ఇంగ వాళ్ల వాళ్లగుర్తులున్న జెండాలు వట్టి జనంల గుంపు గట్టి ఆ యా పార్టీలోళ్ల గూసున్నరు. కాకి నెక్కర్లు దొడ్గిన వాలంటీర్లు పిల్లల సముదాయిస్తమంట చెట్లసాటుకు వోయి పిల్లల బిస్కోట్ల పొట్లాలిప్పి నములుతుండరు. ఇది యిట్లుండగనె

రంగనాయకులు లేసి జనం సుట్టూర నాల్గుదిక్కులు కలె జూస్కుంట పాపం అనెటట్ల దండాలు వెట్టిండు, అది జూసి జనం ఆగకుండ సప్పట్లు గొట్టిన్రు.

సోదర సోదరీమణలు అంట మొదలు వెట్టి, గద్దెల మీద కూసున్నదిక్కు ఈ పక్క ఆపక్క పార జూసి మళ్ల జనం ల దిక్కు జూస్కుంట అయ్యో ! యిదేంది? ఈనాటికీ యింగా గద్దెల మీద నాఆడివిల్లలు వొక్కరు గూడ కండ్ల వడ్తలేరు, ఈ ఎర్తి కొట్టిచ్చినట్ల కండ్ల వడ్తుండది. రాండితల్లి, మీ సెరలు దొలిగె కాలం వొచ్చింది అంట ఆరివారం వొలు

కంగ విల్సిండు, ఈ మాటంయన్నది యినంగనె జనంల కెల్లి జోగుళాంబ లేసి వొయ్యారంగ గద్దెమీదికి వోయి కూసున్నది.

వో సప్పట్లంటె సప్పట్లు

మళ్ల రంగనాయకులు గొంతు సవరిచ్చుకోని ఎల్కలుదిన్న పిల్లి తీర్గ బొంగురు కుత్కె వెట్టి జెండాలకు గురివెట్టి చూస్కుంట ' నా తల్లులూ, తండ్రులు, అన్నలూ తమ్ములు, జెరనామాట యినిపిచ్చుకోండి. ఈనాడు నాకు తీరు తీరు రంగుల జెండాలు కండ్ల వడ్తుండవి. ఇన్ని పార్టీలుంటె ఎట్ల ? తల్లికి పిల్లలందరు సమానమె. ఆ సంటి పాలు అందరికి రుచే ! మరి పార్టీలు యిన్ని వుంటె ? యా పార్టినంట తల్లి గెలిపిస్తది ? పార్టీ లెక్కువై అటెంక తల్లినిబదునాం జేస్తె ఏం లాబం ? అందికె రొండు మూడు రంగుల జెండాలకన్న ఎక్కువ పార్టీలు వుండగూడదు ' అన్నడు. ఈ మాటలిన్నోళ్లకు సప్పట్లు గొట్టాల్నొ ? లేదో ? తెల్వక సప్పట్ల కోసం లేపిన సెయ్యిని లేపినట్లె వెట్టి వూకున్నరు. ఇంగ అది జూసిన రంగనాయకులు ఎటు దిక్కు గుడ్లుర్మిండో ? గని సర్, సర్న సీటీలినొచ్చినయ్. వోసప్పట్లు ! వోనగండ్లోలె గుర్సినయి. పాటిచ్చి చూసెటోళ్లకు రొండు మూడు రంగుల జాండలకన్న ఎక్కువ గుర్తులున్నవి నాయకులు ఎంత తండ్లాడిన, గింజుకున్న గాన్రాకుండ జేబులల్లకు వోయిదస్తీలోలె అణిగిదాక్కున్నవి. యా దిక్కుజూసిన నాల్గు జెండాలె ఎగురుతుండయి.

మళ్లా సప్పట్లు రంగనాయకులకు 'జై' 'జై 'లు. రంగనాయకులు గూసున్నడు. ఈనడుంగలనె నాయకుల గురువు నాయక రాట్సు లేసి 'నా పిల్లలూ ! యా నా రొండు మాటలు మీరంతా యినాలె. మీరందరు నాకు రొండు కండ్లు. అంత మీకోసం మీ మంచి కోసమె ! లేకుంటె ? నాకేం గావాలె ? వోసిన్న పంచె, బుడ్డిసెంబెడు వ్యాకపాలు, వోశారెడు బాదం గింజలు, ఏది జేసిన అది నా సంతుకోసం అంటె ? మీకోసం. మీరంత ముందలికి నడ్సి మంచి గవుండాలన్న తాపత్రయం నాది. అంట అంటుండగనె సప్పట్లు, జై, జై లు వో మొగలు ముట్టినయి.

మళ్ల నాయకరాట్సు జడలయ్య వుపన్యాసాన్ని సాగిచ్చుకుంట 'సూడుండి రేపు ఎన్ని కెలొస్తుండవి. అందికె మన పార్టీల గుర్తులన్ని నర్కుతం పొడుస్తం అనెటట్ల హుకూమత్ జేసినట్ల వుండగూడదు. పులి, సింహం, ఏనిగె, వొంటెగుర్తులొద్దు. నక్కసిన్నదె గని అది జిత్తులమారి అంట నమ్మరు జనం ల వుట్టి జనంల వెర్గి జనానికి దగ్గెర జర్గినట్లుంటె

మంది 'అయ్యో! పాపం! ఎంత అంబ్యాదనెంబరి అనెటట్ల గుర్తులుండాలె అంట మీరూ ఆలోచన జేయిండి. అంటుండంగనె

తాను గుడ వో తఖ్తుకు సూటివెట్టిన నెంబరి లేసి 'అయ్యా! మీరంటున్నది నూటికి నూరువాళ్తు నిజమె! మీరు జెప్పిన సంగతె నాక్యాల్ల ఎన్నాళ్లనుండొ మెదల్తుండది. నేను ఆలోచన బాగనె జేసినగని యా గుర్తులు మిగిలిచ్చిన్రు, యావి దక్కనిచ్చిన్రు? మనోండ్లు? చెట్టు, కంకి, పువ్వు, ఆకు, ఎద్దు, నాగలి, కొడువలి, సుత్తె, రాట్నం, సైకలు, బండి, చక్రం అన్ని అయిపాయె. ఇంగ యాది మిగులు వడివుంది అంట? ఇంగ కొత్త గుర్తులు ఛూ మంత్రం అంట మంతరిచ్చి, మైదు జల్లితెత్తమ? అంట ఏడ్పు మొకం బెట్టెట్యాళ్లు, ఆడున్నోళ్లు తమకు యాదికొచ్చిన గుర్తులన్ని రాసి ఒగ రెంట వొగరు సదివిన్రు.

ఈ పేర్లన్ని యిన్న పెబ్బ జడలయ్య పనికిరాని గుర్తుల పేర్లన్ని కొట్టేసి, వో నాల్గు గుర్తులు మెప్పితమైనట్ల అవిటొంక గురిజూసి కండ్ల తోటె నగిండు. జడలయ్య మొకం కళ జూసి జనంల వుబ్బువట్టలేక ఆ గుర్తుల పేర్లు తెల్సుకుందమంట 'ఆ గుర్తులేందొ? సెలువియ్యాలె' అంట ల్యాజిగ లొల్లి జేస్కుంట అడ్గవట్టిన్రు.

మంది ఆత్రంల మందివుంటె గద్దెమీద గూసున్న వో సిన్నపాటి నాయకయ్య లేసి మైకి వట్టుకోని ''సోదర సోదరీ మణులు మీరంతా శాంతంగవుండాలె శాంతం! శాంతం! శాంతం అంటె వొప్క. అందికె వో గడిసేపు వొప్కవట్టుండి అంట అంటుం డగనె గద్దె మీది కెల్లి యింగో మంత్రి తఖ్తుకు సూటివెట్టి కల్వరిస్తున్న గంగ గోవిందు సెంగు మంట దుంకి 'అమ్మో! తంతులోడు ఈ లౌడు యిస్పీకరి దొర్కవట్టుకోని తానె నా కన్న ముంగల వుపన్యాసం దంచి వోట్లు దక్కించు కుంట ననుకున్నడు అనుకోని ఆయిన సేతి కెల్లి మైకు గుంజుకోని 'గొంతు సరాయించి-

' నా అన్నదమ్ములు, నా అక్కసెల్లెండ్లు, నా కండ్లు, నా కాల్జేతులు యినుండి అంట మొదలు వెట్టంగనె యిస్టేజి మీదున్న జోగుళాంబ ''ఇదేందుండి! జనాన్ని నా కన్నూ ముక్కు కాళ్లు సేతులంటుండరు? యింగా నయం నా కార్జం, నాగుండె కాయె, నా పేగులు అనలేదు' అని పరాస్క మాడింది. ఆ మాటలిన్న జనం పడి పడి కడ్పులుబ్బ నగవట్టిన్రు.

ఇదంత జూసి జడలయ్య 'రంగం కట్టు దప్పుతుండదంట నాల్గు ఎల్కలను

నముల్కా మింగిన పిల్లి తృప్తిగ మ్యావ్ అన్నట్ల లేసి '' సోదర సోదరీ మణులార యినుండి ఇవి ఖాయం జేసిన నాల్గు గుర్తులు-

ఒకటి సల్కోపార- ఇది అనాది నుండేవుండింది. ఇది బూతల్లి ఎంటనె వుట్టింది అంట పెద్దోళ్ల జెప్పంగ యిన్న. ఎన్కటికి భగీరదయ్య శివుని శికె నుండి జారిన గంగమ్మను ఈ సల్కోపార పోంటె కాల్వ జేసుకుంట కొండొచ్చి బూమ్మీదికి పాతాళానికి పారిచ్చిండంట. ఇది మామూలు గుర్తు గాదు సుమా !

ఇంగ రొండోది 'గొంగడి బొంత' - ఈ గొంగడికి చెప్పుకుంటవోతె పెద్ద చెరిత్రనె వుండది. ఎన్కటికి మన దేవుడు పూషణయ్య గుడ ఈ గొంగడినె కట్టుకునెటోడంట. వేదకాలంల, ఆ నాడు మొక్కువళ్ల చెల్లించుకుంటున్న దేవుతలు గుడ ఈ గొంగడి బొంతనె కొప్పెరవెట్టుకునె టోళ్లంట. ఇప్పుడిది మన ప్యాదసాదలకు సలికి కప్పుకోను, ఎండకు సెత్రోలె కొప్పెర వొట్టు కోను, అడ్కకు ఏసుకోను అక్కర కొచ్చె సుట్టమైంది, మరి దీన్ని గాదంటమ ?

మూడో గుర్తు జన్నవార - ఇది మన ఆడివిల్ల జోగుళాంబకు కరారైన గుర్తు. అబ్బో ఈ గుర్తేం ఏరి పారేసిదిగాదు. దీనికి ఎంతనో పురాతన చెరిత్రవుండది. అది మీ అందిరికి ఎరికే ! ఎన్కట మన రుషయ్యలు మొలలకు, జంజాలకు, నూలుతాళ్ల పనికిరావు. నూలు దారం మైల అంట ఈ జన్నవారనే వేని కట్టుకునెటోళ్లంట. అంతెందుకు ? మన శివయ్య పెండ్లాం పార్వతమ్మ తపస్సున గూసున్నప్పుడు ఈ జన్మనారనె ముంజితాడోలె వేని మొలకు మూడు సుట్లు దిప్పుకున్నదంట. ఇంగ నల్గురు గూడి శిగపట్లు వట్టు కోంగ నారదయ్య కుశాలుగ నాట్కం దొక్కొటప్పుడు ఈ జన్నవారనె కుంచోలె జేసి సేతుల దిప్పుకుంట చిందుదొక్కొటోడంట.

ఇంగ ఈ నాడు యీ జన్నవార మన జోగుళంబ సేతుల సీపిరి కట్టోలె అమరి దుమ్ము దుల్పుతది. వొద్దనకుండి.

ఇంగనాల్గోది రాయి చిప్ప - ఇది అడ్కనవడి, దగవడ్డ తమ్ముల నాయకుని గుర్తు అనంగనె ఆ నాయకుడు లేసి అయ్యా ! నాదో యిన్నపం. శనాళ్లనుండి నా మనుసు లో కోరిక రెపరెప లాడుతుండది. అడుక్కతినె సిప్పగుర్తు నా కొద్దు నోరు లేని జీవరాసు లంటెనె నాకు ప్రాణవార్తికం. అందుట్ల 'ఆవు' అన్న 'కుక్క' అన్న నాఎదలకు ఎంత దగ్గరనొ ?

ఆవు అందరిసొత్తు. అందుట్ల కొత్తలేదు '. ఇంగ 'కుక్క పిల్లి' గుర్తె బాగుంటదిగని ఇప్పటి దాని అలు వాట్ల వల్ల అది తక్కువ జాతిలెక్కకొస్తది. అదిగాకుండ అవుతలి పార్టోళ్ల 'వీణి కుక్క బుద్ధి' యాడ్కిపోతది అంటరు. వొద్దు. ఇంగ నాదృష్టిల గాడ్డి మొదులుతుండది. పాపం అది కసూ కాయిదందిని కష్టం జేస్తది. ఎన్కవడ్డోళ్లను ఈసడిచ్చుకున్నట్ల దాన్ని దమ్మిడికి కొరగాకుండ జూస్తుండది సంఘం.తన సుకం యిడ్సి ఈ రొండు కాళ్ల మనిషికి సేవలు జేస్తుండది.గాడ్డి పేరు విన్పంగనె నా ఎదలు నిండిన ఆరివారం పొంగి నా రొండు కండ్లు సెమ్మ గిల్లంగ ఏడ్పొస్తుండది. అనంగనె రచ్చమీద ఉన్నోళ్లంత ఔనంటె ఔనని దస్తు రుమాళ్లు దీస్కొని కండ్లు దుడ్సుకోని పనిల పని అంట ముక్కులు దుడ్సుకున్నరు.

రచ్చకాడ యిట్ల జర్గుతుండంగ ఏ పార్టోళ్లు సైగజేసిన్రో గని మందిల కెల్లి వో తల్లి రయిక మంట లేసి వో చెప్పతరం గాని శిగం వూగుకుంట ''నేను వోట్లమ్మను నన్న మిగ మీరి నడుస్తాన్రా, కన్నెర్రజేస్త కాలరాస్త '' అంట నల్గురు ఆగవట్టిన గని ఆగకుండ గద్దె మీదికి వుర్కవట్టింది.

అది జూసి జెడలయ్య రొండు బొమ్మలు వొక్కటి జేస్కుంట రంగనాయకుల సెవుల ఏందో వూదిండు. వొరెప్ప పాటు కాలంల వూళ్లెకు మనిషిని దర్మి, బండారు, రయికె బట్ట , వూదు, పూలుదెప్పిచ్చిండు రంగనాయకులు. అయ్యగారు మంతరిచ్చి తల్లీ ! శాంతం ! మా వోండ్లు నిన్ను మర్వరు. నీ సల్లటి కంట కనిపెట్టు. మనూరి యిజ్జతు గాపాడు అంట వల్కివూదు పొగేసి బండారు వెట్టిండు, ఆపొగవారినట్లల్ల శిగమూగిన తల్లి నిప్పుల మీద నీళ్లు సల్లినట్ల సప్పున సల్లారి, ఎగురుడు, వూగుడు మాని ఎగపోసు కుంట గూసున్నది. ఎందుకోగని అవుతలి పార్టోళ్ల మొకాలు నల్లగ్గాంగ తడారినట్ల పెదువులు తడ్పుకున్నరు. ఎందుకన్న మంచి దంట జెడలయ్య పెద్దిర్కొం జూపు కుంట ''ఆడివిల్లలందరు సీకట్లువడంగ యీాడ నిల్వకుండ వూళ్లెకు నడ్వాలె '' అంట జెప్పి - అందరికి దండాలు వెట్టి సబ ముగిసినట్ల బండ మీద మూడు సర్పులు సర్సిండు.

యెవ్వారమంత సూసెటోళ్ల సూపులు నిలవెట్టెటట్ల జరిగింది. పర్పుబండ వోట్లు వో లెక్కపోంటి నడుస్తవి అంట జనం గుస గుసలు వోయిన్రు.

నేను మా మామ ఎంట యింటికి నడ్సిన.

★